క్లుప్తంగా

విత్తనశుద్ధితో మెరుగైన దిగుబడులు



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వీఏఏ

మునగపాక : విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని అరబుపాలెం వీఏఏ సత్య రవి రాజ్ అన్నారు. అరబుపాలెం గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగుకు సంబంధించి మంచి ఫలితాలు సాధించాలంటే తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి దోహద పడుతుందన్నారు. సుడోమోనాస్‌ను పిచికారీ చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చన్నారు. రైతులు కొయిలాడ ఎర్రయ్య నాయుడు, శరగడం గణేష్, బొడ్డేడ మహలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేయస్కరం



ర్యాలీలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి

మునగపాక : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మునగపాక ఐసీడీఏస్ సెక్టార్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని మహిళలు తీసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణులు తాము తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిల్లా మలేరియా అధికారి ఆకస్మిక తనిఖీ



ఉప్పరాపల్లి గ్రామంలో పర్యటిస్తున్న జిల్లా మలేరియా అధికారి

ఎస్.రాయవరం : గ్రామాల్లో దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుని వాటి వల్ల సోకే వ్యాధులు నివారించాలని జిల్లా మలేరియా అధికారి పి.జె.ఎం.ఆర్.పి నాయుడు అన్నారు. ఉప్పరాపల్లి గ్రామంలో బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వీధుల్లో తిరిగి మురుగునీటి నిల్వలు, పేరుకుపోయిన చెత్త ఎప్పటికప్పుడు తొలగించి దోమలు వ్యాప్తిని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది టి.నాగేశ్వరరావు, ప్రసాద్, కె.శ్రావణి పాల్గొన్నారు.

'నిర్వాసితులకు న్యాయం చేస్తేనే కారిడార్ పనులు'

నక్కపల్లి : మండలంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులు సమస్యలు పరిష్కరించాకే పనులు ప్రారంభించాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం చందనాడ రైతులు సంఘ జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ తాళ్ల భార్గవ్‌లు మాట్లాడుతూ భూమి లేని పేదలకు దళితుల, మత్స్యకారులకు, కల్లుగీత కార్మికులకు, రజకులకు, ఇతర పేదలకు 2013 భూసేకరణచట్టం ప్రకారం ఇవ్వవలసిన ప్యాకేజీ, సాగు భూములకు, చెట్లకు, ,ఇళ్లకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఎన్నికల ముందు అధికారులు నిర్వహించిన గ్రామ సభలు సందర్భంగా నిర్వాసితులు ఇచ్చిన దరఖాస్తులన్నింటినీ సర్వేలు చేసి వాటిని పరిష్కారం చేయాలని, ప్రతి చెట్టుకు పరిహారం, ప్రతి నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చి చందనాడ బట్టీలు, డీఫారం , సాగు భూములకు, మత్స్యకారుల సొసైటీ భూములకు నష్ట పరిహారం ఇచ్చిన తరువాత మాత్రమే పనులు ప్రారంభించాలని అన్నారు. అలా చేయకుండా చేస్తే 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని, నిర్వాసితులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు సైతం ఇదే డిమాండ్ చేశారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ప్యాకేజీ చెల్లించకపోతే పనులు అడ్డుకుంటామన్నారు. నిర్వాసితులు జి.గోవిందు, పి.సువర్ణరాజు, వై.మన్నియ్య, వై.విజయ్ కుమార్ ఉన్నారు.

వ్యర్థాల కుప్పలు... వ్యాధుల వెతలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ గొంగలి అక్కడే అన్నట్లు మండలంలో ఏ గ్రామంలో చూసిన పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలు,చెత్తకుప్పలు ఎక్కువగా పేరుకుపోవడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలుతున్నా అధికార యంత్రాంగం మాత్రం అటువైపు కన్నెత్తైన చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

- పలు గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- ప్రధాన ప్రాంతాల్లో కనిపించని పరిశుభ్రత
- సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతం
- నిర్లక్ష్యం వీడని అధికార యంత్రాగం



అధ్వానంగా మురుగునీటి కాలువ



భోగాపురంలో రోడ్డు పక్కన వేసిన చెత్త , కుళ్లిన వ్యర్థాలు

రాంబిల్లి (యలమంచిలి) : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామ వార్డు సచివాలయం సిబ్బందితో కలసి గ్రామాల్లో పర్యటించి ఎక్కడా పారిశుధ్యం లోపించకుండా ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో సర్పంచ్‌లు ఏ పని చేయాలన్నా తమకు చెప్పి చేయాల్సిందే అని అధికారులకు అధికార పార్టీ మద్దతు ఉన్న సర్పంచ్‌లకు హుకుం జారీ చేయడంతో పంచాయతీల్లో నిధులు ఉన్న సర్పంచ్‌లు గ్రామాధికారులు ఎటు చెప్పాలో తెలియక గ్రామాల్లో పారిశుధ్యంపై శీతకన్ను వేశారు. ఒక వైపు వ్యాధుల కాలం ప్రజలు సీజనల్ వ్యాధులు జ్వరాలు, డయేరియా, మలేరియా వంటి రోగాల బారిన పడి ఆస్పత్రులకు క్యూ కుడుతున్నారు. విష జ్వరాలు ప్రబలడంతో ప్రజలు గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో గ్రామాల్లో మురుగు నీటి కాలువలలో పూడిక తీసి వాటర్ ట్యాంకులను నిర్ణీత సమయానికి క్లోరినేషన్ చేయడం, బ్లీచింగ్ చల్లి గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించి వాటి ద్వారా వర్మికంపోస్ట్ ద్వారా ఎరువులు తయారు చేసేవారు. ప్రతి ఇంటికి వెళ్లి సీజనల్ వాధులు సోకకుండా ముందస్తు ఫీవర్ సర్వే చేపట్టేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పారిశుధ్య చర్యలు గాలికొదిలేశారు. రాంబిల్లి మండల కేంద్రం, వాడపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం కొప్పుకగుండుపాలెం, కొత్తపేట గోవిందపాలెం, దిమిలి, గోకివాడ, భోగాపురం, జంగాలపాలెం, పల్లపు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీటి కాలువల్లో నీరు అధికంగా చేరి చెత్త చెదారం కుళ్లిన వ్యర్థాలతో కాలువల్లో నీరు రోడ్లపై ప్రవహించడంతో దోమలు పెరిగి ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని గ్రామాల్లో అధికారులు తూతూ మంత్రంగా మురుగునీటి కాలువల్లో పూడిక తీసి చెత్తను వేరే ప్రాంతాలకు తరలించకుండా అక్కడే వదిలేశారు. చెత్తకుప్పలు తొలగించినా మరలా అదే ప్రదేశంలో చెత్తను వేయకుండా నిరోధించడానికి అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యంపై చర్యలు తీసుకొంటారని కోరుతున్నారు.



మురుగుతో నిండిపోయిన డ్రైయినేజీ

తూతూ మంత్రంగా చెత్త తొలగింపు



గ్రామాల్లో మురుగునీటి కాలువల్లో నామమాత్రంగా చెత్త, పూడికతీత తీసి పంచాయతీ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. కూటమి నాయకుల ఇళ్ల వద్ద తప్ప సామాన్య ప్రజల ఇళ్ల వద్ద మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించడానికి శ్రద్ధ చూపడం లేదు. ప్రజల వద్ద పన్నుల రూపంలో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్న అధికారులు పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది.
-రేఖానందగోపాల్, హరిపురం, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్

వ్యాధులు ప్రబలుతున్నాయి..



గ్రామాల్లో చెత్త చెదారం వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. గత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగేది. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులు అందించేవారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదు. మా పంచాయతీలో పాలక వర్గం లేక ప్రజల సమస్యలపై అధికారులు సక్రమంగా పట్టించుకోవడం లేదు. పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలి. -ధూళి రమణ, భోగాపురం గ్రామం

పారిశుధ్య చర్యలు చేపట్టాం..

ప్రతి గ్రామంలో మురుగునీటి కాలువల్లో పూడిక, రోడ్ల పక్కన వ్యర్థాలు చెత్తను తొలగించమని మండలంలో పంచాయతీ కార్యదర్శులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం. ప్రతి గ్రామంలో వాటర్ ట్యాంక్‌లు శుద్ధి చేసి క్లోరినేషన్ చేయాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా మురుగునీటి కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ, బ్లీచింగ్ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేస్తున్నాం.
-ఎస్.వెంకటాచలం, ఎంపీడీవో, రాంబిల్లి మండలం

సుప్రీం తీర్పు హర్షణీయం



నాగులాపల్లిలో దళిత బహుజన సేవాసమితి సమావేశం

మునగపాక : ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు పచ్చజెండా ఊపుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నాగులాపల్లిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో దళిత బహుజన సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డొక్కా శివకుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుదీర్ఘ పోరాటం చేసి విజయం సాధించడం సంతోషకరమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబెట్టుకున్నాయన్నారు. పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణకు సంబంధించి మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటం ఫలించిందన్నారు. కార్యక్రమంలో డొక్కా రాజు, ప్రేమ్‌కుమార్, బుంగరాజు, వెంకట్, నాగేంద్రకుమార్, మురళి, రమణ, కామరాజు,శ్రీను పాల్గొన్నారు.

రైతుల వివరాలు సొసైటీకి అందించాలి

మునగపాక : మండలంలోని నాగులాపల్లి, చూచుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ (పీఏసీఎస్) సభ్యులంతా కంప్యూటరీకరణలో భాగంగా వివరాలు అందజేయాల్సి ఉంటుందని ఆయా సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు వి.జ్యోతీశ్వరరావు,రాజేష్‌కుమార్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సభ్యత్వం ఉన్న ప్రతి రైతు తన ఆధార్ కార్డు జెరాక్స్‌తో పాటు మొబైల్ నంబరును సంఘ కార్యాలయాలకు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

తాడేపల్లికి స్థానిక ప్రతినిధుల పయనం



తాడేపల్లి బయలు దేరిన నక్కపల్లి మండల ప్రతినిధులు



పాయకరావుపేట నుంచి బయలు దేరిన ఎంపీటీసీలు

నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు తాడేపల్లి బయలు దేరారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే, వైఎస్సార్‌సీపీ తరపున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను బరిలో నిలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలతో సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను తీసుకుని జిల్లాకు చెందిన సీనియర్ పార్టీ నాయకులు తాడేపల్లి బయలు దేరారు. తాడేపల్లిలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలవనున్నారు. బుధవారం వీరంతా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవి సూర్యనారయణరాజు, పార్టీ సీనియర్ నేతలు వీసం రామకృష్ణ, చిక్కాలరామారావు, బొలిశెట్టిగోవిందరావు, దత్తుడు సీతబాబు, దనిశెట్టి బాబూరావుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేసుకుని జగన్‌ను కలవడానికి వెళ్లారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వైఎస్సార్‌సీపీకి సుమారు 600కి పైగా ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్‌సీపీదే. గెలుపొందేందుకు అవసరమైన సంఖ్యా బలం లేకున్నప్పటికీ టీడీపీ ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీలో నిలిపి, వైఎస్సార్‌సీపీ సభ్యులను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నిస్తోంది. విచ్చల విడిగా డబ్బులు వెదజల్లి తమ వైపు తిప్పుకుని దొడ్డిదారిన ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పార్టీ తరపున గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు మేమంతా మీ వెంటే ఉన్నామని, ఎమ్మెల్సీని కైవసం చేసుకుంటామని తెలియజేసేందుకే ఈ ప్రతినిధులంతా తాడేపల్లి తరలి వెళ్లారు. తాడేపల్లి వెళ్లిన వారిలో పార్టీ ముఖ్య నాయకులు ఎంపీపీలు ఏనుగుపల్లి రత్నం, ఇసరపు పార్వతీ తాతారావు, లోవకుమారి, జెడ్పీటీసీలు గోసల కాసులమ్మ, లంకసూరిబాబు, సిద్దాబత్తుల దేవి, కాకర దేవి, నాయకులు నారాయణమూర్తిరాజు, పొడగట్ల పాపారావు, కుమార్‌రాజా, కొణతాలశ్రీను ఉన్నారు.

కూటమి ఎన్ని కుట్రలు చేసినా మాదే విజయం

ఎస్.రాయవరం : కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఘన విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశం అయ్యేందుకు బుధవారం మండలం నుంచి ప్రత్యేక బస్సులు, ప్రయివేటు వాహనాల్లో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తరలివెళుతున్నామన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నిక తిరుగుబాటుకు నాంది కావాలని చెప్పారు. విజయవాడ తరలివెళ్లిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఎంపీటీసీలు బొండా వెంకటలక్ష్మి, బాలం సూరిబాబు, పోలవరపు పార్వతి, నాగంబోయిన ఉమ పాల్గొన్నారు.



విజయవాడ తరలి వెళ్లిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీ దేవి తదితరులు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జోగులు

పిల్లలకు తల్లిపాలే పౌష్టికాహారం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య



యండపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

పాయకరావుపేట : పిల్లలకు తల్లిపాలు మంచి పౌష్టికాహారం అని, ప్రతి తల్లి పిల్లలకు 2 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు తల్లి పాలు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య అన్నారు. తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సౌజన్య తల్లి పాలపై తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి : తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందని నక్కపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత అన్నారు. బుధవారం ఒడ్డిమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ర్యాలీ నిర్వహించారు. లలిత మాట్లాడుతూ పుట్టిన శిశువుకి తల్లిపాలు చాలా ఆరోగ్యం అన్నారు.పుట్టినప్పటి నుంచి మంచి ఆహారాన్ని అందిస్తే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటవురట్ల : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హైమవతి అన్నారు. యండపల్లి, కొడవటిపూడి, కోటవురట్ల గ్రామాలలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. వీధుల్లో ర్యాలీ చేసి అవగాహన కల్పించారు. యండపల్లిలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లులకు తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తద్వారా వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతుంది. ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్నా పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు తొలగించకుండా ఉల్లంఘనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఈ నెల 7వ తేదీన సాక్షి దిన పత్రికలో కోడ్ ఉల్లంఘనపై చర్యలేవీ ? అంటూ వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం ఎంపీడీవో ఎం. మన్మథరావు గ్రామాల్లో పర్యటించి కోడ్ అమల్లో ఉన్నందున ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

సంపద తయారీ కేంద్రంతో ఆదాయం

మునగపాక : సంపదతయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఈవోఆర్డీ వెంకటలక్ష్మి అన్నారు. తిమ్మరాజుపేట సంపద తయారీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సంపదతయారీ కేంద్రాల ద్వారా తయారవుతున్న ఎరువులను విక్రయించడం ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. అలాగే పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శి రమణరావును ఆదేశించారు.

12న మండల సర్వసభ్య సమావేశం

మునగపాక : మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు తమవద్ద ఉన్న సమాచారంతో హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం : పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. పెదగుమ్ములూరు, అడ్డురోడ్డు కొంతమేర నివాసాలకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

పాయకరావుపేట : పట్టణంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో గల 11 కె.వి. తాండవ షుగర్ ఫ్యాక్టరీ ఫీడర్ బ్రేకర్, 11 కేవీ చక్కానగర్ ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ రాజశేఖర్ తెలిపారు. బృందావనం, ధనిశెట్టినగర్, పండరిపురం, షీలానగర్, ఇందిరానగర్, లింగాలకాలనీ, రాజీవ్ కాలనీ, దుర్గానగర్, దుర్గాకాలనీ, శాంతినగర్, పీఎల్‌పురం జగనన్న కాలనీ, పెదిరెడ్డి లక్ష్మీనగర్, దేవీనగర్, చక్కా నగర్, ఆనంద్ నగర్ కాలనీ, ప్రకాష్ కాలేజ్ ఏరియా, దొరకాలనీ, నామవరం, సీతారాంపురం పరిసర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాంబిల్లి (యలమంచిలి): వరిలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక శాతం దిగుబడి పొందవచ్చునని అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం అధికారి పి.విజేత అన్నారు. బుధవారం రాంబిల్లి మండలం కుమ్మరాపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. జీవన ఎరువులు, పచ్చిరొట్టనిచ్చే జీలుగు, జనుము, భూమిలో ఏవిధంగా దున్ని సాగుచేయాలో రైతులకు వివరించారు. విచక్షణరహితంగా పురుగుమందులు వాడవద్దన్నారు.

ఎస్.రాయవరం : పెట్టుగోళ్లపల్లి గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి నారు తీసేటప్పుడు మొక్కలు లేతాకుపచ్చగా ఉంటే మూన త్వరగా తిరుగుతుందని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. చదరపు మీటరుకి 33 మూనలు ఉండేలా చూసుకుని నాట్లు వేయాలన్నారు.

కొత్తపేటను నేవల్ బేస్ నిర్వాసిత గ్రామంగా గుర్తించాలి

- అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం

రాంబిల్లి (యలమంచిలి) : నేవల్‌బేస్ నిర్వాసిత గ్రామంగా కొత్తపేట గ్రామాన్ని గుర్తించాలని కొత్తపేట గ్రామ సర్పంచ్ వానపల్లి అరుణలత, గ్రామస్తులు అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణను కోరారు. రాంబిల్లి మండలంలో నిర్మిస్తున్న నేవల్ బేస్‌లో కొత్తపేట గ్రామం, భూములు కోల్పోయిన నిర్వాసితులు బుధవారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చిన్నికృష్ణను కలిసి సమస్యలు విన్నవించారు. నేవల్ బేస్‌లో కొత్తపేట గ్రామానికి చెందిన భూములు, కొండ గట్టులు కోల్పోవడంతో గ్రామ ప్రజలు జీవనభృతిని కోల్పోయారని తెలిపారు. గ్రామంలో ప్రజలు కొండ భూముల్లో పెంచిన చెట్లకు, అలాగే నిర్వాసితులకు ప్రభుత్వం ఎటువంటి జీవనభృతి ఇప్పటివరకు కల్పించలేదని, గతంలో నేవల్‌బేస్ వద్ద జరిగిన నిర్వాసితుల ధర్నా నేవల్ బేస్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) కొత్తపేట గ్రామాన్ని నేవల్‌బేస్ నిర్వాసిత గ్రామంగా గుర్తించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించినా ఇప్పటి వరకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందని వారు ఆర్డీవోకి వివరించారు. నావికా స్థావరానికి వెళ్లే ప్రధాన గేటు ద్వారం వద్ద సర్వే నెం 287 బై 1ఏ 133 ఎకరాల పెదమ్మ చెరువు గర్భం, గేటును అనుకొని వున్న పైడమ్మగుడి నేవల్‌బేస్‌లో కలిసిపోయిందని, దానికి సంబంధించి నష్టపరిహారం ఇంతవరకు అందలేదన్నారు. గ్రామంలో 16 ఎస్సీ కుటుంబాలకు 1978లో పైడమ్మ చెరువు సమీపంలో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, పట్టాలు పొందిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీవో దీనిపై సమగ్రంగా విచారణ చేసి కొత్తపేట గ్రామ నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు గ్రామస్తులు తెలిపారు. ఆర్డీవోను కలిసిన వారిలో కొత్తపేట గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వానపల్లి జగన్నాథరావు , పుత్సా బాబురావు , ధర్మాల పైడిరెడ్డి, కడగల పైడిరాజు, మాడెం వెంకటరమణ, సిగటాపు అనిల్, దొడ్డి సుభద్రాదేవి ఉన్నారు.



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కొత్తకోట సర్పంచ్, గ్రామస్తులు

నిరంతర సాధనతోనే ఉన్నత స్థానం సాధ్యం



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు

యలమంచిలి రూరల్ : నిరంతర సాధన, పరిశ్రమతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ అన్నారు. కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సులు చదివి వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన బుధవారం కళాశాల సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఏపీపీజీఈ సెట్, సెంట్రల్ వర్సిటీ పీజీ ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ చూపి వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొందిన 54 మంది విద్యార్థులను ఆయన, అధ్యాపకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. పీజీ కోర్సుల్లో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారికి సూచించారు. ప్రవేశపరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు, పుస్తకాలను బహుమతిగా అందించారు. ఈ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు.